నా పేరే భగవాన్

కురుమద్దాలి విజయలక్ష్మి

"అమ్మడూ! జాగ్రత్త. రేపు ఉదయం సర్కార్‌లో వస్తాము."

"నాన్నగారూ! నేనేం చిన్నపిల్లను కాను. ఈ ఉదయంనుంచీ ఇప్పటికి 'జాగ్రత్త...జాగ్రత్త' అంటూ కనీసం వందసార్లయినా చెప్పి వుంటారు" అంది అమల నవ్వుతూ.

అమల తెలివికి మురిసిపోతూ "చూచావు టే రాజేశ్వరి! అమ్మడంటే అల్లాటప్పా కాదు" అని ఫక్కున నవ్వారు పరంధామయ్యగారు.

పరంధామయ్య, రాజేశ్వరమ్మలకి, అమల ఏకైక సంతానం. అమిత గారాబంగా పెంచినా అమల బుద్ధి

మంతురాలు. తెలివి కలదీ.

"అమలకి అప్పుడే ఇరవై ఏళ్ళు నిండాయి. దిక్కు మాలిన చదువు ఎవరిని ఉద్ధరించను? పెళ్ళి చేస్తే ఈ పాటికి పిల్లల తల్లయి కళకళలాడుతూ వుండేది," అంటుంది రాజేశ్వరమ్మ. ఆడపిల్లలకు పెళ్ళి, పిల్లలు, అనుకూల దాంపత్యం చాలని ఆమె అభిప్రాయం.

"అమ్మడు ఇష్టపడ్డప్పుడే పెళ్ళీ పేరంటం. పెళ్ళిమాట నా ముందెత్తకు. దానిష్టమొచ్చినంతకాలం చదువుకోని," అంటారు పరంధామయ్య.

పెద్ద చదువులు చదవటం, గొప్ప పనులు చేయటం అమలకు ఇష్టం. ప్రస్తుతం బి. ఏ. చదువుతున్నది.

పక్క ఊళ్లోనే చుట్టాలింట్లో పెళ్ళి. వాళ్ళయినా చాలాదూరం చుట్టాలు. బీదవాళ్ళు. పెళ్ళి రాత్రి ఒంటి గంటకి. అందుకే సర్కార్‌లో ఏడు గంటలకు బైలుదేరి తిరిగి ఉదయం సర్కార్‌లో రావాలని అనుకున్నారు.

తెల్లవారితే పరీక్షలు. అందుకే పెళ్ళికి రానంది అమల.

పరంధామయ్య, రాజేశ్వరమ్మ ఎక్కిన రిక్షా బైలు దేరింది.

రిక్షా వీధి మలుపు తిరిగిందాకా చూచి ఇంట్లోకి వచ్చి తలుపు గడియ బిగించింది అమల.

పరంధామయ్య ఇల్లు పెద్దది అంటే, పన్నెండు పెద్ద గదు లున్నది. మూడు గదులు చిన్న కాపురానికి అద్దె కిచ్చారు. ఆ వాటాలో వాళ్ళు యాత్రల నిమిత్తం పది రోజుల క్రితం తమ వాటాకి తాళంవేసి వెళ్ళిపోయారు.

అమల సహజంగా ధైర్యం కలది కాబట్టే ధైర్యంగా తల్లి తండ్రులను పంపించి, ధైర్యంగా వుంది.

అమల భోజనం ఎనిమిది గంటలకే చేసింది. కాసేపు విశ్రాంతిగా మంచంమీద మేను వాల్చింది. తెల్లవారి బి. ఎ. పబ్లిక్ పరీక్షలు మొదలు. పుస్తకాలు ముందేసుకొని చదవసాగింది.

2

"ఇటొక్కసారి చూడు..."

కీచుగా వినిపించింది కిటికీలోనుంచి. అమల క్షణం కొయ్యబారిపోయింది.

"నీకే చెప్పేది? ఇటొక్కసారి చూడు!"

మళ్ళీ అదే కీచు కంఠం. అమల చదువుతున్న పుస్తకం తెలియకుండానే చేతిలోంచి జారిపోయింది. గుండె దడ దడలాడింది.

అమల భయం కప్పి పుచ్చుకుని, చటుక్కున తల ఎత్తింది కిటికీ వైపు.

కిటికీకి అనుకుని ఓ వికృతాకారుడు నుంచునివున్నాడు. అతని రెండు చేతులు కిటికీ ఊచలను పట్టుకుని వున్నాయి. అమల వణికిపోతూనే విసురుగా లేచి వేగంగా కిటికీ తలుపులు వేయబోయింది.

సగం తలుపులు వేస్తూ వుండగానే వికృతాకారుడి చెయ్యి పని చేసింది. చేతిలో ఇంక్ పిల్లర్ లాంటి దానితో మత్తు మందు నొక్కాడు. జిల్లులా అమల మొహాన కొట్టింది. అమల అలానే మంచంపై వాలిపోయింది.

వికృతాకారుడి చేతిలో లావుపాటి చిన్న కొంకి కర్ర వుంది. ఆ కర్ర పిడివైపు తిప్పి లాగితే అది చాలా పొడుగాటి కర్ర అయింది. ట్రాన్సిస్టర్ ఏరియల్ రాడ్‌లా నిర్మించబడింది ఆ కర్ర.

కొంకి కర్రను కిటికీలోంచి పోనిచ్చి అమల లోపల

వేసిన తలుపు గడియపైకి ఎత్తాడు. ఆ తర్వాత వాకిలి తలుపు గడియకూడా కొద్ది శ్రమతో తీయగలిగాడు.

పరంధామయ్య దంపతులు ఊరి కెళ్ళినట్లు...ఆ ఇంట్లో మరో ప్రాణి లేనట్లు ముందే తెలుసేమో? తాపీగా ఇంట్లో ప్రవేసించాడు వికృతాకారుడు. ముందుగా అమల పుస్తకాలు తిరగేశాడు. దస్తూరీ పరీక్షించాడు. తల పంకించి నోట్ బుక్‌లో కాగితం చించి, అమల పెన్ అందుకున్నాడు. జాగ్రత్తగా రాయటం మొదలుపెట్టాడు.

"అమ్మ, నాన్నగార్లకు,

మీ దృష్టిలో పాడు పని, నా దృష్టిలో మంచి పని చేశాననుకుంటున్నాను. నన్ను క్షమించండి. నేను జహాంగీర్ ఖాన్‌ని ప్రేమించాను. కులమతాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే మీరు మా పెళ్ళికి ఒప్పుకోరు. ఖాన్ మనలో కలవడు, నేను ఖాన్ కోసం వాళ్ళ మతం స్వీకరించి పెళ్ళి చేసుకోదలచుకున్నాను. అందుకే నేను ఈ రాత్రి ఖాన్‌తో వారి ఇంటికి వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఎప్పటికో వస్తాను. నా గురించి దిగులుచెంది ప్రయోజనం లేదు కాబట్టి, ధైర్యం తెచ్చుకుని మనస్ఫూర్తిగా క్షమించండి. నాకోసం ఆరాలు తీయవద్దు. మధ్య మధ్య నా క్షేమ సమాచారాలు లెటర్స్‌ద్వారా తెలుపుతుంటాను. ఏదయినా నా కొరకై చర్య తీసుకుంటే నా శవం మాత్రమే మీకు దక్కుతుంది. ఇలా వ్రాస్తున్నందుకు నాకూ బాధగానే ఉంది. అందుకే ఏమీ తీసుకెళ్ళటం లేదు. మీ బాధ, కోపం తగ్గిం తరువాత వస్తాను. మీ అమ్మడుని క్షమించండి. అంతే నేను కోరేది.

మీ

అమల (అమ్మడు)"

వికృతాకారంగా వున్నతను, తను రాసింది ఒకటికి రెండుసార్లు చదువుకున్నాడు. అమల రైటింగ్, తను రాసింది ఒకేలా వుండటంతో, రాసిన కాగితాన్ని టేబుల్ మీద పెట్టి, అది ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టాడు. కిటికీ తలుపులు మూసేశాడు. టేబుల్ లైట్ ఆర్పేశాడు.

అమలను చేతులమీద ఎత్తుకుని బైటకు వచ్చాడు. యథావిధిగా అన్ని తలుపులు మూసేసి వాకిలి తలుపుకి చిన్న తాళం వేశాడు.

ఆ ఇంటికి కొద్ది దూరంలో ఆపిన తన కారు వద్దకు అమలను ఎత్తుకు వచ్చాడు. కారు డోర్ తెరిచి వెనుక సీటులో పడుకోబెట్టాడు అమలను. తనెళ్ళి డ్రైవింగ్ సీట్ లో కూర్చున్నాడు.

శరవేగంతో కారు ముందుకు దూసుకుపోయింది.

3

"ఎవరు నీవు? నన్నెందుకు తీసుకొచ్చావు?" అమల కోపంగా అడిగింది వికృతాకారుడిని.

"నేనెందుకు తీసుకొచ్చిందీ చెపుతాను. నా పేరు భగవాన్. నే చెప్పింది జాగ్రత్తగా విని ఆచరిస్తే నీకు మేలు జరుగుతుంది. కాదంటే నీ తల్లి తండ్రులను కట్టి దీసుకువచ్చి వారిముందు, నిన్ను పదిమంది రేప్ చేసేటట్లు చేస్తాను. అది చూచి నీకన్నా ముందే వాళ్ళు గుండె ఆగి చస్తారు. ఆ తర్వాత నీ కళ్ళముందే మీ అమ్మా నాన్నని చిన్న చిన్న ముక్కలుగా నరికి..."

"ఆపండి... నేనేం అపకారం చేశాను?"

"నువ్వుగాని మీ వాళ్ళుగాని నాకే అపకారం చేయ లేదు. నాకో పని నీవల్ల కావలసి వుంది. మంచిగా చెపితే

నీవు వినవు. నా ప్లాన్ సక్సెస్ కావాలంటే తప్పదు నీ ఎడల కఠిన చర్య తీసుకోవటం,'' భగవాన్ అంటూనే చప్పట్లు చరిచాడు.

పక్క గదిలోంచి పదిమంది వస్తాదుల్లాంటి యువకులు వచ్చారు.

''వీళ్ళనోసారి పరీక్షగా చూడు'' అన్నాడు భగవాన్.

అమల, భగవాన్ చెప్పకముందే వాళ్ళందరినీ చూచింది.

''ఊ, మీరెళ్ళవచ్చు'' భగవాన్ అనంగానే వస్తాదులు వెళ్ళిపోయారు గది విడిచి.

''వీళ్ళు రేప్ చేయటంలో ప్రవీణులు,'' భగవాన్ అన్నాడు అదేదో సాధారణ విషయం చెపుతున్నట్లు.

అమల ముఖం చిట్లించి మౌనం వహించింది.

''నే చెప్పిన పని చేస్తావా అమలా?''

అమల ఉలిక్కిపడింది.

''నా పేరెలా తెలుసు?''

''బాగుంది. అవసరార్థం నిన్ను తీసుకొచ్చినప్పుడు, అన్ని వివరాలు తెలుసుకోకుండా ఉంటానా? మీ అమ్మా నాన్నకు నీవు ఏకైక సంతానం. అందమొకటేకాదు, తెలివి తేటల్లోకూడా నీవే ఫస్ట్. బి. ఏ. చదువుతున్నావు. ముఖ్యమైన వివరాలు ఇవి. చాలుగా? మరి నా మాట వింటే నీకే అపకారం జరగదు. మా పని అయిపోయిం తరువాత నీ వెళ్ళిపోవచ్చు.''

''ఏం పని, ఎన్నాళ్ళు పడుతుంది?''

''ఏంపనో చెపుతాను. ఎన్నాళ్ళు పడుతుందీ అన్నది ఖచ్చితంగా చెప్పలేను. నాలుగైదు నెలలు పట్టవచ్చు.''

"మా అమ్మ, నాన్న గారు నే ఇంట్లో లేకపోవటం చూచి దిగులుతో మంచం పట్టొచ్చు. నే కనపడలేదని పోలీసు రిపోర్టు ఇవ్వొచ్చు," అంది అమల ఓ రాయి విసురుతూ.

భగవాన్ గదంతా ప్రతిధ్వనించేటట్లు నవ్వాడు.

"నా సంగతి తెలియక తప్పుగా అంచనా వేశావ్ అమలా! ఈ భగవాన్ ఏ విషయంలోను పొరపాటుపడడు. నీకే ప్రమాదము జరగదని, కొన్ని కారణాలవల్ల మీ అమ్మాయిని తీసుకెళుతున్నామని, పోలీసు రిపోర్టు ఇవ్వకుండా వుంటే మీ అమ్మాయి మీకు దక్కుతుంది, అని మీ ఇంట్లో లెటర్ పెట్టి నిన్ను తీసుకువచ్చాను. నా మాట నీ వింటే నీ క్షేమ సమాచారాలు మీవాళ్ళకు...మీవాళ్ళ క్షేమ సమాచారాలు నీకు లెటర్స్ ద్వారా తెలుసుకునే ఏర్పాట్లు చేస్తాను. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా లేకని నీ విషయంలో నాకెంతో నమ్మకం వుంది. చాటుగా నిన్నెంతో కనిపెట్టి స్టడీచేశాను."

అమల ఆలోచించింది.

ఈ భగవాన్‌గా డెవడో, మారుపేరు, మారు రూపం వేషధారి. తనవసరం చాలా వుంది వీడికి. కాదని మొండికేస్తే తన మాన ప్రాణాలే కాదు, తన తల్లిదండ్రులను కూడా నానాహింసలు పెట్టొచ్చు. వీళ్ళమాట వింటూనే వీళ్ళ ఎత్తుకు పైఎత్తు వేసి, ఈ కుంభకోణంనుంచి బయట పడాలి!

అమల ఓ నిర్ధారణకొచ్చింది.

"నేనేం చెయ్యాలో చెప్పండి," అడిగింది నెమ్మదిగా.

"గుడ్. వెంటనే ఓ నిర్ణయానికొచ్చావ్. చెప్పేది జాగ్రత్తగా విను...భుజంగరావ్ ఓ శ్రీమంతుడు. అతనికి

భార్య లేదు. ఒక్క తే కూతురు. పేరు సరోజ. ముమ్మా రులా నీలాగానే వుంటుంది. రోజా అంటారు అందరు. రోజా అంటే పంచప్రాణాలు భుజంగరావ్ కి. రోజా, ప్రభాకర్ అనే అతన్ని ప్రేమించింది. భుజంగరావ్ ఆ ప్రేమను ఒప్పుకుని పెళ్ళి ముహూర్తం పెట్టాడు. తెల్లారితే పెళ్ళి. తప్ప తాగున్న డ్రైవర్ కారుతోలటం, ఆ కారు యాక్సిడెంట్ కి గురికావటంతో, కారులో వున్న ప్రభాకర్ అక్కడికక్కడే మరణించాడు.

రోజా పిచ్చిదయిపోయింది ఆ షాక్ తో. ఓ మాట పలుక లేదు. ఇరవై నాలుగు గంటలు గొణుగుతూ గోళ్ళు గిల్లు కుంటూ కూర్చునేది. భోజనపలహారాలు తినిపించటం, స్నానం వగైరాలు దాసిది చూచేది. ఎందరో పెద్ద డాక్టర్లకి రోజాని చూపించాడు భుజంగరావు. షాక్ తో మతి పోయింది కాబట్టి, ఏదయినా షాక్ వల్ల - అదీ అదృష్టం ఉంటే మళ్ళీ మతి రావచ్చు. ట్రీట్ మెంట్ వల్ల బాగు కాదని తేల్చారు.

భుజంగరావు వృద్ధుడయిపోయాడు. రోజా పిచ్చిదయి పోయిందనే దిగులుతో కృంగిపొయ్యాడు. ఇలా వుండగా ఉన్నట్లుండి ఓ రోజు రోజా ఇంట్లోంచి మాయం అయింది. ఇది జరిగి ఆరు నెలలయింది. డబ్బు వెదజల్లి ఊరు వాడలు రోజాకోసం వెతికించాడు. రోజాను తీసుకొచ్చి అప్పగిం చిన వారికి లక్ష రూపాయలు ఇస్తానని ఫోటోతో సహా పేపర్లో ప్రకటించాడు. కాని ఇంతవరకు రోజా జాడ లేదు,'' ఓ నిమిషం ఆగాడు భగవాన్.

''ఇప్పుడు ఆరోజాని నేనే అని తీసుకెళ్ళి భుజంగరావ్ గారికి చూపి లక్షరూపాయలు తీసుకోవటమేనా మీ ప్లాన్?'' అమల అడిగింది.

"నో. నో. లక్ష నాకో లెక్క కాదు. భుజంగరావ్ కోటీశ్వరుడు. లంకంత ఇల్లు. నౌకర్లు చాకర్లు, చుట్టాలు, ఫ్రెండ్స్ కళకళలాడుతుంటుంది ఇల్లు. నాకు కావలసింది భుజంగరావ్ మొత్తం ఆస్తీ!!

"ఎలా వస్తుంది ఆ ఆస్తి?"

"జరిగిన కథ చెప్పాను. జరగబోయేది విను. భుజంగ రావ్ ఇంట్లో ఎందరో చుట్టాలు, నౌకర్లు ఉన్నారు. వీళ్ళలో ఎవరైనా రోజాని మాయం చేశారేమో అని భుజంగరావ్ అనుమానం. అందరు నమ్మకమైవాళ్ళు ఆప్తులు. ఎవరిమీద తన అనుమానం వెళ్ళబుచ్చగలడు? ఈ మధ్య స్మాల్ గా హార్టెటాక్ వచ్చింది భుజంగరావుకి. చని పోతానని అనుమానం పట్టుకుంది. రోజా బ్రతికుండి ఏనాటి కయినా తిరిగివస్తే, ఆస్తి మొత్తం రోజాది. రోజా కనప డక పోతే యావద్దాస్తీ అనాధాశ్రమాలకు పోతుంది. అలా వీలునామా రాశాడు. కాబట్టి..."

"ఊ...కాబట్టి...? ఏం చేయాలి?"

"నీవు రోజా అవతారం ఎత్తి భుజంగరావ్ ఇంట్లో చేరాలి."

"భుజంగరావ్ గారు అనుమానిస్తే నా గతేంకావాలి?"

"కొద్దిగా నీ రూపం మార్చితే నీవు రోజావి అవి పోతావు. రోజా అలవాట్లు నీకు నేర్పుతాము. నీవా ఇంట్లో పిచ్చిదానివిగానే ప్రవేశిస్తావు కాబట్టి, ఎవరూ అనుమానిం చరు. నీకే అపకారం జరగకుండా నీ నీడలా నేను వుంటాను."

"రోజాగా ఆ ఇంట్లో నేను ప్రవేశించినంత మాత్రాన మీకెలా భుజంగరావ్ ఆస్తి వస్తుంది?"

"అవన్నీ మేము చూసుకుంటాము. నే చెప్పింది చేస్తావో, లేదో చెప్పు?" భగవాన్ కఠినంగా అన్నాడు.

అమల ఓ క్షణం ఆలోచించింది.

"ఏం చేయాలో చెప్పండి. చేస్తాను. కాని నా క్షేమం నావాళ్ళకు, నా తల్లితండ్రుల క్షేమం నాకు ఎప్పటికప్పుడు తెలియాలి."

"గుడ్ గరల్, తెలివిగల వాళ్ళెప్పుడూ ప్రాణానికి ముప్పు తెచ్చుకోరు. నీ క్షేమమే మా క్షేమం. నీ ప్రాణమే నా ప్రాణం. సరేనా? ఇక చేయాల్సింది, రోజా గడ్డం కింద అరంగుళం గాటు ఉంది. మెడమీద పుట్టుమచ్చ ఉంది. అలాంటి మార్పులు నీకు చేస్తాను. రోజా ప్రవర్తన అలవాట్లు నీకు నేర్పుతాము. సమయంచూచి ఆ ఇంట్లో నిన్ను ప్రవేశపెడతాము. నేను ఆ ఇంట్లోన్నే అనుక్షణం వెయ్యి కళ్ళతో నిన్ను కనిపెడుతూ వుంటాను. కాని నన్ను నీవు గుర్తించలేవు. ఇప్పుడు నేను మారు వేషంలో వున్నాను. ఆ ఇంట్లో సగంమంది నావాళ్ళు. పిచ్చి పిచ్చి వేషాలు వేయవద్దు. వెంటనే నాకు తెలిసిపోతుంది. జాగ్రత్త."

"అలాగే మీరు చెప్పినట్లే వింటాను. మరి మీ రెవరయి నదీ తెలియంది మావాళ్ళకి నాకు మధ్య లెటర్స్ ఎలా చేరవేస్తారు?" అమల అనుమానం వెళ్ళబుచ్చింది.

"అన్ని ఏర్పాట్లు సవ్యంగా చేసి, అన్ని విషయాలు విశదీకరించి మరీ నిన్ను ఆ ఇంట్లో ప్రవేశపెడతాము. పిచ్చి దానివిగా-నటించటం నీవంతు. మిగిలిన పని పూర్తిచేయటం మా వంతు. నీ ఆమోదం పూర్తిగా ఉందిగా?"

"అలాగే. చెప్పండి" లోలోపల మండిపోతున్నా నవ్వుతూ అంది అమల.

భగవాన్ ఒక్కొక్కటీ వివరంగా చెప్తుంటే అమల "ఊఁ" కొడుతూ మధ్య మధ్య తనకొచ్చిన అనుమానం తీర్చుకుంటూ కూర్చుంది.

4

భుజంగరావ్ గారింటికి అమల వచ్చి సరీగా వారం అయింది.

అమల ధైర్యస్థురాలే అయినా, తల్లిదండ్రులకు దూరంగా, పరాయి ఇంట్లో పిచ్చిదానిలా...తనే పోయి దొరికిన కూతురనుకుంటూ వెర్రి భ్రమతో ఆనందం పొందుతున్న భుజంగరావ్ గారిని మోసంచేస్తూ...ప్రతినిమిషం తనని పలకరించే ఇంట్లో బంధువులు నౌకర్లు, ఓ నాటి రోజా ఫ్రెండ్స్...అందరి మధ్య సతమతమవుతూ రోజులు గడుపుతూంది. తను భగవాన్ చెప్పిన రేఖలు బాగా గుర్తుంచుకుంది. వీరిలో భగవాన్ ఉన్నాడు. కాని ఎవరు భగవాన్ అయినదీ తెలియటంలేదు.

అమ్మా, నాన్న, ఫ్రెండ్స్, కాలేజీ, సినిమాలు, షికార్లు బి.ఏ. పరీక్షలు—అన్నీ గుర్తొస్తున్నాయి అమలకి. అందుకే ఒంటరిగా గదిలో కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

భుజంగరావ్ నిశ్శబ్దంగా గదిలోకి వచ్చాడు. అమల పక్కనే కూర్చుని అమల భుజంమీద చెయ్యివేశాడు.

"ఎందుకు తల్లీ ఏడుస్తున్నావ్? నిన్నెవరయినా ఏమన్నా అన్నారా? చెప్పు తల్లీ, వాళ్ళను ముక్కలు చేయిస్తాను."

చివ్వున తల ఎత్తింది అమల. కన్నీళ్ళు తుడుచుకునే ప్రయత్నం చేయలేదు. తెల్లని తెలుపు వెండిరంగు తల కట్టు. పండుటాకులా ఉన్న భుజంగరావ్ ప్రపంచంలో

ప్రేమనంతా కళ్ళల్లో నింపుకుని తనవైపు చూస్తుంటే అమల నోరు తెరవలేకపోయింది.

"చెప్పు తల్లీ! ఎందుకు కన్నీరు కారుస్తున్నావ్?" భుజంగరావు, అమల కళ్ళు తుడుస్తూ అడిగాడు.

'మిమ్మల్ని మోసం చేస్తున్నందుకు, నా తల్లితండ్రులను చూడ నోచుకోగలనో లేదో అని...' అమల అనుకుంది.

"నేను... నేను ... చచ్చిపోతాను ... అందుకేడుస్తున్నాను. ఇంకా బాగా ఏడవనా?" అమల పిచ్చిధోరణిలో చేతులు తిప్పుతూ అంది.

"అలా అనొద్దు తల్లీ, నే చూడలేను. నువ్వు నా కళ్ళముందు ఉన్నావని, అదే వెయ్యివరహాలని ఆనందిస్తున్నాను. క్షణం నీవు దూరమయితే ఇహపై నేను బ్రతకను తల్లీ!" కళ్ళనీళ్ళతో అన్నాడు భుజంగరావు.

"ప్రభా! ప్రభ, దేముడూరేగే ప్రభ" పిచ్చిగా అనసాగింది అమల.

పక్కగదుల్లోంచి మేనేజరు రామచంద్ర, దూరం చుట్టం అయిన శంకరం వచ్చారు.

రామచంద్ర, శంకరం ఈ ఇంట్లో వున్న మరి ఇద్దరు భగవాన్ ఎత్తు, లావుతో వుంటారు. వీళ్ళల్లో యెవరో ఒకరు భగవాన్. అంతవరకూ ఖాయం. ఎవరు తనని తీసుకొచ్చిన భగవాన్?

"బాబుగారూ! అమ్మాయిగారికి పిచ్చి ఇదివరకటి కన్నా ముదిరింది. మళ్ళీ ఇంట్లోంచి వెళ్ళిపోతారేమో? గొలుసుతో ఓ కాలు కట్టేసి ఉంచితే మంచిది," మేనేజరు రామచంద్ర అన్నాడు భుజంగరావుతో.

అమల ఉలిక్కిపడింది.

"మనమంతా లేమా? ప్రతి నిమిషం చూస్తూ రోజాని కాపాడటమే, కాళ్ళూ చేతులు కట్టమని యేం సలహా ఇండి?" శంకరం అన్నాడు.

"నా కెవరూ, ఏ సలహాలు ఇవ్వకండి. నా తల్లి ఎన్ని పిచ్చిపనులు చేసినా జాగ్రత్తగా చూడటమే మీ పని. అంతే," కఠినంగా అన్నాడు భుజంగరావ్.

'అమ్మయ్య' అనుకుంది అమల. ఈ గదుల్లో తిరగ టానికి లేకుండా కాళ్ళూ, చేతులు కట్టి పడేస్తే అంత కన్నా వేరే నరకంలేదు.

"మీరంతా వెళ్ళిపొండి. లేకపోతే నే నేడుస్తాను. ఆ...అంతే," అంది అమల పిచ్చిగా చూస్తూ.

"వద్దు తల్లీ! నీవు కళకళలాడుతూ వుండటమే నాకు కావలసింది. నీ కంట నీరు చూడలేను. పద శంకరం, పద రామచంద్రం" భుజంగరావ్ లేస్తూ అన్నాడు.

"నా ప్రభ...నీ ప్రభ ... అంతులేని ప్రభ ... ఆకాశ మంత ప్రభ..." అమల చేతివేళ్లు లెక్కపెడుతూ తనలో తను అనుకోసాగింది.

జాలిగా అమలను చూస్తూ ముగ్గురూ గదిలోంచి వెళ్ళి పోయ్యారు.

అమల ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ భగవాన్ గాడు చెప్పినట్లు నటిస్తే తన తల్లితండ్రు లకు తనకి ఏ అపాయం ఉండదు. ఇలా ఎంతకాలమో? దీని వెనుక కథాసూత్రధారి ఆపై పరమాత్ముడికే ఎరుక. తను క్షేమంగా ఉన్నట్లు రాత్రిపూట లెటర్ రాసి కిటికీ సందులో ఉంచింది. తన తండ్రి తనకు రాసిన లెటర్ ఆ మర్నాడు కిటికీ సందులో ఉంది. ఎవరు, ఎట్లా యీ ఇంద్ర

జాలం చేస్తున్నారు? నాన్నగారు లెటర్‌లో 'తల్లీ అమలా! నీ క్షేమమే మాకు కావలసింది. నీవు రాసిన ఉత్తరం అందినది. మళ్ళీ ఇంకో ఉత్తరం రాస్తాను. ఇరుగు పొరుగుతో నీవు ఊరికి వెళ్ళినట్లు చెప్పాము. అమ్మ కులాసా.'

ఇదీ నాన్నగారి లెటర్‌లో సారాంశం. నాన్నగారి హాండ్ రైటింగ్ తనకి బాగా తెలుసు. ఈ భగవాన్ గాడు ఈ విషయంలో తన్ని మోసం చేయటంలేదు.

భగవాన్ చెప్పిన ప్రకారం ఆ రోజు తను చినిగి పీలిక లైన చీర కట్టుకుని రోడ్డుపక్కగా కూర్చుంది. కూరలు తెస్తున్న నౌకరు తన్ని చూచి భుజంగరావ్ కూతురు సరోజగా గుర్తించాడు. తను పిచ్చిదానిలా రాను రాను అంటున్నా బలవంతాన రిక్షా ఎక్కించి, ఈ ఇంటికి తీసుకొచ్చాడు. నౌకరు కంట తను పడేటట్లు ప్లాన్ పన్ని భగవాన్ చేశాడా? లేక నౌకరుకూడా ఈ విషవలయంలో వాడా?

"సరోజమ్మగారూ! తల దువ్వుతాను," అంటూ దాసీ నర్సమ్మ నూనెసీసా, దువ్వెన,అద్దంతో గదిలోకి వచ్చింది.

"ఎవరి తల?" అంది అమల.

"మీ తలే నమ్మగారూ!"

"సరే దువ్వు. జాగ్రత్త, సరీగా పదిజడలెయ్యాలి."

"మీ రెట్టా చెపితే అట్టాగే ఏస్తానమ్మగారూ?"

"మంచి పిల్లవు, నీవు నాకు నచ్చావ్," అంది అమల యాభయ్యో పడిలోవున్న నర్సమ్మతో.

తన్ని పిల్ల అంటుంటే నర్సమ్మకి ఏడ్వాలో, నవ్వాలో అర్థం కాలేదు. జాలిగా అమలని చూసి అమల జడ విప్పుతూ కూర్చుంది.

అమల అద్దం తీసుకుని తన ముఖం చూచుకుంది అద్దంలో. ఆశ్చర్యపోయింది.

గడ్డం దగ్గర గంటు. మెడమీద పైసా అంత పుట్టు మచ్చ. కనుబొమలు తనకి వత్తుగా వుంటాయి. కాని ఇప్పుడు సన్నగా వున్నాయి. తను అమలే కాని పోలికల్లో కొంత తేడా ఉంది.

"అమ్మగారూ! అద్దంలో చూచుకుంటున్నారా?" అంది నర్సమ్మ.

"ఊఁ చూస్తున్నాను... చూస్తున్నాను... ఈ అద్దంలో పిల్ల నేనూ కాదు, నీవూ కాదు. ఎవతి? కోతిముఖంది..." అంది అమల.

"పూర్వజన్మలో ఏ పాపమో గాని, బంగారంలాటి తల్లి బ్రతుకు ఇలా అయింది," అంది నర్సమ్మ.

అమల మాట్లాడలేదు. అద్దంలో తన రూపం చూసుకుంటూ కూర్చుంది.

5

"తల్లీ అమలా,

నీవు రాసిన ఉత్తరం అందింది. అమ్మ కులాసా! నిన్ను ఒక్కసారి చూద్దామని వుంది. కాని...నీ గురించి దిగులు పడవద్దని రాశావు. ఆ ధైర్యంతో ఉన్నాము. భగవాన్ అనే అతను నాకు పదివేలు కద్దంటున్నా ఇచ్చాడు. మా పని త్వరలో పూర్తి అవుతుంది, మీ అమ్మాయిని జాగ్రత్తగా మీ కప్పగిస్తామని అర్ధరాత్రి వచ్చి చెప్పాడు. నీ ఫ్రెండ్ మోతీ కులాసాగానే వుంది. మోతీతోకూడా నీవు ఊరికెళ్ళినట్లు చెప్పాము. ఉత్తరాలు రాస్తూ ఉండు. నువ్వసలే దుడుకుపిల్లవి. తెలివిగా ఏదో చేయబోయి అప

దలో ఇరుక్కోకు. నీకు అపకారం జరిగితే నేనూ అమ్మా భరించలేము. ఉంటా. అమ్మ నిన్ను అడగమంది.

మీ నాన్న,
పరంధామయ్య."

లెటర్ చదివిన అమల కసిగా 'ఎంత మోసం!' అను కుంటూ పళ్ళు కొరుక్కుంది.

"మోతీ అనే స్నేహితురాలు తనకి లేదు. ఈ భగవాన్ గాడు తను రాసే లెటర్స్ నాన్నగారికి, నాన్నగారు రాసే లెటర్స్ తనకి నిజంగా అందిస్తున్నాడా? లేక వాడు ఆదే నాటకంలో ఇదీ ఓ భాగమా?" అని ఆలోచించి చిన్న ప్లాన్ పన్నింది. నిజంగా తాను రాసే లెటర్ నాన్నగారికి అందితే, "మోతీ గురించి రాశావు? ఆ నీ స్నేహితురా లెవరో మాకు తెలియదు. ఎందు కిలా రాశావు?" అంటూ తప్పక రాసేవారు నాన్నగారు.

"మోతీ అనే స్నేహితురాలు నీకు లేదు. ఎందుకిలా మీ నాన్నగారికి రాయవలసి వచ్చింది," అంటూ గద్దిం చుతూ మరో లెటర్ కిటికీలో ఉంచేవాడే భగవాన్.

మధ్యమధ్య ఇలా చెయ్యి, అలా చెయ్యి. ఈ విష యంలో నిన్న పొరపాటు చేశావు. జాగ్రత్తగా ప్రవ ర్తించు అంటూ భగవాన్ లెటర్స్ కిటికీలో ఉంచుతూనే వున్నాడు. కాబట్టి భగవాన్ ఆడుతున్న లెటర్స్ నాటకం ఇది. ఏం చేయాలి?

అమ్మ, నాన్నగారికి నా విషయం అసలు తెలియదు. నే నేమైపోయానో అని దిగులుపడుతూ ఉండివుంటారు. పోలీసు రిపోర్ట్ ఇచ్చారేమో అని ఆశ పడదామా అన్నా భగవాన్ గాడు అంతదూరం రానీయడు. బెదిరించి నన్ను లొంగదీసుకుని పిచ్చిదాన్ని చేశాడు. అక్కడ నాన్న

గారిని మరోవిధంగా బెదిరించి నా గురించి పోలీసులదాకా పోకుండా చేసివుంటాడు.

'భగవాన్! తాటిని తన్నేవాడుంటే తల తన్నేవాడు ఆపై వుంటాడు. భుజంగరావ్ గారు ఉత్తములు. వారికి ద్రోహం తలపెట్టావు. వారి ఆస్తి చేజిక్కించుకోటానికి బెదిరించి పావులా నన్ను వాడుకుంటున్నావు. అంతేగాక, నీ మాట గత్యంతరం లేక వింటున్నందుకు నాటకంపై నాటకం ఆడుతున్నావు. జరిగింది భుజంగరావ్ గారితో ఒక్కమాట చెపితే మంచు విడిపోయినట్లు కథ విడిపోతుంది. భుజంగరావ్ గారితో నే చెపుతూవుండగా విని నన్నో, భుజంగరావ్ గారినో పై లోకానికి తరలిస్తావు. నీవాడుతున్న నాటకానికి పైనాటకం ఆడి నీ అంతు తేల్చకపోతే నా పేరు అమల కాదు.'

చాణుక్య శపథంలా తనలో తాను శపథం చేసింది అమల.

'ఏం చేయాలి? ఏం చేస్తే ఈ ఇంట్లోంచి బైట పడతాను. ఏవిధంగా ఈ ఇంట్లోనే దాగున్న మోసగాడైన భగవాన్ గుట్టు బైటపడుతుంది?' తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంది అమల.

లెటర్‌ని భద్రంగా భగవాన్ అంతకు క్రితం చెప్పిన విధంగా ఫ్లవర్ వాజ్ లోపల వుంచి ఫ్లవర్ వాజ్ లో పూల గుత్తి సర్దింది.

"తిరుగులేని పథకం ... భగవంతుడు బైటకొచ్చే ప్లాను," ఆలోచిస్తూ కూర్చుంది అమల.

6

"తల్లీ రోజా! మన కృష్ణ వస్తున్నాడమ్మా," ఓ లెటర్ చేతిలో పట్టుకుని భుజంగరావ్, అమలకద్దకు వచ్చి

సంతోషంగా చెప్పాడు.

"కృష్ణా! ఎవరు?" గబుక్కున అమల అడిగి తన పొర పాటు తెలుసుకుంది. వెంటనే పిచ్చిగా చూస్తూ వుండి పోయింది.

"అదేనమ్మా నీ బావ కృష్ణ. అమెరికాలో చదువు ముగించుకుని వస్తున్నాడు. నా చెల్లెలి కొడుకు. 'బావ... బావ' అంటూ ఎంతల్లరి చేసేదానివి! ప్రభాకర్ మధ్యలో రాకపోతే కృష్ణ, నీవు పచ్చని దాంపత్యంతో నా కన్నుల పండుగగా ఉండేవారు. ప్చ్."

"ఎవడీ కృష్ణ, ఏమా కథ? ప్రభాకర్, వింటున్నావా? కృష్ణట కృష్ణ. హరేరామ హరేరామ, హరేకృష్ణ అరే కిట్టా, హరేప్రభ అరెరె ప్రభ," అమల చప్పట్లు చరుస్తూ అంది.

భుజంగరావ్ గారికి దూరపు చుట్టం, అల్లుడు వరస అయిన సుందరమూర్తి అమల గదిలోకి వచ్చాడు. సుందర మూర్తి ఎత్తు, లావు భగవాన్‌లాగానే వుంటాడు. భగ వాన్ అవునో, కాదో ఆ పరమాత్ముడికి తెలియాలి.

"మామయ్యా!" సుందరమూర్తి అమలవైపు చూస్తూ పిలిచాడు.

"ఏంటి సుందరం?"

"కృష్ణ మామూలు డాక్టర్ కాదు. బ్రెయిన్ స్పెష లిస్ట్. అమల పిచ్చి కుదర్చవచ్చు."

"అదేరా సుందరం నా ఆశ. పెద్ద పెద్ద డాక్టర్లు రోజా తల్లి పిచ్చిని కుదర్చలేమన్నారు. మన కృష్ణ ఫారెన్‌లో చదివి వస్తున్నాడు. నా తల్లి బాగయి మామూలు మనిషవు తుంది."

"కృష్ణ నాకు బావ అవుతాడు. అతను బ్రెయిన్‌కి సంబంధించిన పెద్ద డాక్టరు. నా పిచ్చికి ఏమి ట్రీట్ మెంట్ ఇస్తాడో! భగవంతుడా ఈ ఇంట్లోంచి బైటపడే మార్గం లేదా? మాయదారి భగవాన్‌గాడు బైటపడడా? ఏమిటీ దారి?"

"ఏంటమ్మా ఆలోచిస్తున్నావ్?"

'కృష్ణప్రభా, రామప్రభా ... ఇంకేం ప్రభుంటుం దబ్బా?' భుజంగరావ్ మాట వినిపించుకోకుండా బుగ్గన వేలేసుకుని అంది అమల.

భుజంగరావ్ బాధగా సుందరమూర్తి వైపు చూచాడు,

"రంగారావ్ సాబ్, ఫోన్‌లో అర్జంటుగా పిలుస్తున్నారు. మీతోనే మాట్లాడాలిట" శంకరం వచ్చి చెప్పాడు.

భుజంగరావ్, సుందరమూర్తి గదిలోంచి వెళ్ళి పోయ్యారు.

శంకరం గదిలోంచి వెళ్ళలేదు. అటూ ఇటూ చూచి అమలవద్దకు వచ్చాడు. అమల ఎదురుగా నిలిచి భుజంమీద చెయ్యి వేశాడు.

'వీడే భగవాన్‌గాడు' అనుకుంది అమల.

శంకరం చటుక్కున అమలమీదకు వంగి గాఢంగా బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు. శంకరం చెయ్యి అమల భుజంమీదనుంచి కిందకు పాకింది. అమల చెయ్యి చాచి ఫెడేల్‌మని శంకరం ముఖంమీద కొట్టింది. సరీగా ఆ దెబ్బ ముక్కుమీద తగిలింది.

"అబ్బా" అంటూ శంకరం చేత్తో ముక్కు తడుము కుంటూ కోపంగా అమలవైపు చూచాడు.

అమలకు ఇల్లంతా తిరగటానికి స్వేచ్ఛ వుంది. కాపోతే భగవాన్ ముందే చెప్పాడు. సరోజ యొక్క వకాలం తన గదిలోనే గడిపేది. రోజు మొత్తంమీద మూడు నాలుగు సార్లకన్నా బైటకు తానంతట తాను వచ్చేది కాదని.

"పీడు చూడు ప్రభా! నన్ను ముట్టుకున్నాడు. వెధవ గాడిద. పందికొక్కు" పెద్దగా అంటూ, అమల గది లోంచి బైటకు వచ్చింది.

"పిచ్చిముండ. దీనికేం తెలుస్తుంది. ఇంటినిండా మను షులు ఉండబట్టి నా చేతికింద ఇంకా నలగలేదు. అందంగా ఉంటుందని ఓ ఛాన్స్ ఈ పిచ్చిలో చూద్దామనుకుంటే ముఖం పగలకొట్టింది. పిచ్చిబలం అంటారు ఇదే కావచ్చు. ముఖం అదిరిపోయింది."

గదిలోంచి బైటకొస్తూ అనుకున్నాడు శంకరం.

7

"...గారికి,

నా పేరు అమల. భుజంగరావ్ గారి ఆస్తి కాజేయ టానికి ఇంట్లోంచి మాయమయిన సరోజ స్థానంలో సరోజ పోలికలు గల నన్ను, భగవాన్ అనే అతను తీసుకొచ్చి బెదిరించి నియమించాడు. అందరూ నన్ను సరోజ అనే అనుకుంటున్నారు. మా నాన్న అమ్మగారి పేర్లు...మా అడ్రస్...ఇది.

నేను మోసం చేయటానికి ఈ ఇంట్లో ప్రవేసించలేదు. భగవాన్ బెదిరింపుకి లొంగిపొయ్యాను. దైవంలాటి భుజంగరావ్ గారిని మోసగించలేక నా వాళ్ళకు దూరంగా వుండలేక, ఈ నాటకం ఎన్నాళ్లో తెలియక తెగించి ఈ లెటర్ రాస్తున్నాను. భుజంగరావ్ గారితోనే సమయం

చూచి చెప్పొచ్చు. భుజంగరావ్ గారి పక్కన ఎప్పుడూ ఎవరో ఒకరు వుంటున్నారు. ఈ ఇంట్లో నలుగురు వ్యక్తులు భగవాన్‌లాగానే వున్నారు. ఆ నలుగురిలో ఒకరు భగవాన్.

నాకు నమ్మకం కలిగినవారికి ఈ లెటర్ ఇస్తున్నాను. ఈ లెటర్ భుజంగరావ్ గారికి అందిస్తే, వారు మీకు బహుమతి ఇవ్వొచ్చు. వారు చాలా దయా స్వరూపులని తెలిసిపోతూనే వుంది. తర్వాత మోసగాడు ఎవరైనదీ భుజంగరావ్ గారే చూసుకుని నన్ను రక్షిస్తారు.

ఈ నా ఆలోచనే ఈ లెటర్ రాయటానికి కారణం.

భుజంగరావ్ గారు నాటకానికి పై నాటకం ఆడితే గాని భగవాన్ గాడు బైట పడడు.

ఇట్లు
సరోజగా చలామణీ అవుతున్న అమల."

అమల లెటర్ చదివి "బాగుంది. సరీగానే రాశాను. ఇహ ఈ లెటర్ చేర్చే విధం చూడాలి. ఈ ఇంట్లో ఎవరికి అందించాలి?" అనుకుంది.

అమల గదిలో ఆలమరలో అందమైన బొమ్మలతో అలంకరించి ఓ అర వుంది. బొమ్మల వెనుక పెన్ను కాగితాలు వుంచాడు భగవాన్ అమల లెటర్స్ రాయటానికి. అవి వుపయోగించి తాననుకొన్న ప్లాన్ ప్రకారం అమల లెటర్ తయారుచేసింది. లెటర్ చిన్న మడత పెట్టి జాకెట్లో దోపుకుని గదిలోంచి బైటకు వచ్చింది.

అమల పిచ్చిగా చేతులు తిప్పుతూ గొణుక్కుంటూ వరండాలోకి వచ్చింది.

వరండాలో ఏవో ఫైల్స్ చూస్తున్న శంకరం, అమలను చూచి చటుక్కున లేచి నుంచున్నాడు.

'శంకరం, భగవాన్ అయివుండడు. ఎందుకంటే తనని తీసుకొచ్చిన భగవాన్ పదిమందిచేత రేప్ చేయిస్తానని బెదిరించాడుగాని, తన శరీరంమీద చెయ్యి వెయ్యలేదు. అయినా శంకరంకి లెటర్ ఇవ్వకూడదు. తను సరోజ అయినా, అమల అయినా తన రూపంమీద అమిత మోజు.ఎప్పుడు చూచినా శంకరం కళ్ళు తనని కాంక్షతో కామంతో చూస్తాయి.

నాకు లొంగక పోయావా? భగవాన్‌తో చేతులు కలుపుతా నంటే మొదటికే మోసం వస్తుంది. ఉహూ. ఈ శంకరం తన పనికి ఏ విధంగా పనికి రాడు.'

అమల కళ్ళార్పకుండ శంకరంని చూస్తూ అనుకుంది.

"బాబాయ్, ఈ పిచ్చిదానికి మొన్న జరిగింది ఇంకా గుర్తున్నదల్లే వుంది. కళ్ళార్పకుండా తీక్షణంగా ఎలా నావైపు చూస్తున్నదో? మీద పడి రక్కినా రక్కుతుంది. పిచ్చిది. ఏమంటానికి వీలులేదు."

భయంతో అమలను చూసి, గబగబా ఫైల్ మూసేసి, వరండాలోంచి వెళ్ళిపోయాడు శంకరం, ఎవరో తరిమినట్లే.

అమల నవ్వుకుంటూ వంటగదిలోకి వచ్చింది.

దాసీ నర్సమ్మ, వంట నాయర్ తగ్గు స్వరంతో మాట్లాడుకుంటున్నారు. అమల రావటం చూసి, చటుక్కున మాటలాపేశారు. నాయర్ కనుసైగ గమనించి నర్సమ్మ వంట గదిలోంచి ఏదో పనున్నదన్నట్లు బైటకు వెళ్ళింది.

నాయర్ తలెత్తి అమలవైపు చిరునవ్వుతో చూచాడు.

'నర్సమ్మ, నాయర్ నమ్మకస్తులయిన నౌకర్లు అనుకుంది. కాని తను పిచ్చిది అని తెలిసికూడా వాళ్ళిరువురు

తను రాంగానే చటుక్కున మాట లెందుకు ఆపేయాలి నాయర్ కనుసైగ ఎందుకు చేయాలి? అది గ్రహించి నర్సమ్మ ఎందు కళ్ళిపోవాలి? ఈ ఇంట్లో వీ రిరువురి గూఢుపురాణి ఏమిటి? ఇంట్లో సామానులు చాటుగా చేరవేసే ఇంటి దొంగలా? భగవాన్‌గాడి మోచేతి నీళ్ళు తాగి పడున్న మోసగాళ్ళా?'

తను రాసిన లెటర్ నాయర్‌కిగాని నర్సమ్మకిగాని ఇచ్చే ప్రయత్నం మానేసి, ఆలోచనలో పడిపోయింది అమల.

"ఏంటమ్మాయిగారూ! ఏం కావాలి?" అన్నాడు నాయర్ కుక్కర్‌మీద వెయిట్ పెడుతూ.

అమల మాట్లాడలేదు. గోళ్ళు కొరుక్కుంటూ వుండి పోయింది.

"ఇదో పిచ్చిమాలోకం. గొప్పాళ్ళింట్లో కుక్కలకి రాజభోగమే, పిచ్చిముండలకి స్వర్గసౌఖ్యాలే," నాయర్ గొణిగాడు.

'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టే వెధవ. ఈ ఆస్తికి కాబోయే యజమానురాలు, యజమాని కూతురు, ఈ చవటకి పిచ్చిముండ అయింది. లక్షాధికారి కూతురుగా పుట్టికూడా ఏమి సౌఖ్యం అనుభవించావు సరోజా?' అనుకుంది అమల.

"ప్రభాకర్‌గారు...గారు...వచ్చారా?" కనుగుడ్లు మిటకరించి అడిగింది అమల.

"ఆ...ఆ...వచ్చాడు. వచ్చారు. సరాసరి కళ్ళు మూసుకుపోండి. కనపడతారు, ప్రభాకరుడు" నాయర్ వ్యంగ్యంగా అన్నాడు.

"ఇదిగో కళ్ళు మూసుకుని నీవు చెప్పినట్లే వెళుతున్నా. ప్రభా, కనపడక పోయాడో, జాగ్రత్త నీ ముక్కు చెవులు కోసి కుక్కలకు వేస్తా" అని అమల కళ్ళు తెరుచుకునే రెప్పలయినా ఆర్పకుండా గదిలోంచి బైటకు వచ్చింది.

'నాయర్‌ని, నర్సమ్మని, తనని ఈ ఇంట్లో ప్రవేశ పెట్టిన నౌకర్‌ని, శంకరంని, ఎవరిని నమ్మటానికి లేదు. మరి ఎవరిని నమ్మితే పనవుతుంది?' ఆలోచిస్తూ అమల ముందు గదిలోకి వచ్చింది.

ముఖ్యమైన వాళ్ళతో అతి ముఖ్యమైన పనులు మాట్లాడటానికి వరండా పక్కన ఉన్న ముందు గది వుపయోగిస్తుంటాడు భుజంగరావ్.

గది లోపలికి అడుగు పెట్టి ఆగిపోయింది అమల. గిరుక్కున వెనుతిరిగి పోదామనుకుంది. కాని ఆ ప్రయత్నం విరమించి, అక్కడే నుంచుంది.

"రోజా తల్లీ! రామ్మా! ఇంతకుముందే మన కృష్ణ వచ్చాడు. నీ బావమ్మా!" భుజంగరావ్ సోఫాలోంచి లేచి అమల వద్దకు వస్తూ అన్నాడు.

"రోజీ!" అన్నాడు కృష్ణ సోఫాలోంచి లేచినుంచుని.

అమల పిచ్చివాలకంతో కృష్ణని ఎగాదిగా చూస్తూ నుంచుంది.

సీమ దొరలా ఉన్నాడు కృష్ణ. ఖరీదైన సూటు, మంచి పర్సనాలిటి. నల్లని నొక్కుల దుబ్బు క్రాపు. గుబురుగా ఉన్న సైడ్‌లాక్స్. ఉండీ లేనట్లు సన్నని మీసకట్టు. ఎర్రటి పెదవులు విశాలమైన నుదురు. చురుకైన కళ్ళు. సూటిగా ఉన్న ముక్కు. అందము, హుందాతనము అతని సొత్తయినట్లున్నది.

"సరోజ, ఈ కృష్ణను కాదని ప్రభాకర్‌ని ప్రేమించిందంటే, కృష్ణకన్నా ప్రభాకర్ అందమైనవాడా?" అమల ఆలోచిస్తున్నది.

"దా...తల్లీ!" అని అమల చెయ్యి పుచ్చుకుని సోఫా వద్దకు తీసుకెళ్ళాడు. భుజంగరావు.

ముగ్గురు సోఫాల్లో కూర్చున్నారు.

"రోజా! నన్ను గుర్తుపట్టావా? నీ బావ కృష్ణని." అన్నాడు కృష్ణ అమలచెయ్యి తన చేతిలోకి తీసుకొని మృదువుగా నిమురుతూ.

అమల శరీరం గగుర్పొడిచింది. సిగ్గు వేసింది. పిచ్చివాలకంగా చూడటానికి అవస్తపడింది.

"కృష్ణా! నా తల్లి నీవంటే ఇష్టంగానే ఉండేదిరా. ఆ ప్రభాకర్ ఏ దుర్ముహూర్తాన కళ్ళపడ్డాడో ప్రేమపిచ్చిలో పడిపోయింది. కూతురనే మమకారం, నీ విశాలహృదయం వల్ల, వివాహానికి ఒప్పుకోటం అయింది. కాని...కృష్ణా, విధిరా విధి! పూర్తిగా నన్ను వంచించింది. సరోజ పూర్తిగా పిచ్చిదయిపోయిందిరా!"

భుజంగరావ్ గారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"గతం ఇప్పుడెందుకు మామయ్యా! ముందు జరగబోయేది ఆలోచిద్దాం.

మీకు హార్టెటాక్ వచ్చిందన్న వార్త, రోజా ఇంట్లోంచి మాయంకావటం, విని భరించలేని బాధపడ్డాను. మామయ్యా! అప్పటికప్పుడు బయలుదేరి వద్దామనుకుంటే, నువ్వు రావద్దని గట్టిగా లెటర్ రాస్తివి. మీ ఆజ్ఞ మీరటం అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ లేదు. మామయ్యా, నే వచ్చేశాను. ఇంకేవిధమైన వర్రీస్ పెట్టుకోకు. పూర్తి

రెస్ట్ తీసుకో. రోజా సంగతి నే చూచుకుంటాను. రోజాకి పిచ్చికాదు మామయ్యా పట్టింది. మన పూర్వీకులలో ఎవరికైనా పిచ్చి ఉంటే ఆరక్తం రోజాలో వుంది కాబట్టి పిచ్చిదయిందని అనుకోవచ్చు. ఆ పిచ్చి కుదర్చటంకూడా కొంచెం కష్టమే.

ఇది ప్రభాకర్ పోయిన వార్తవిని షాక్ తగిలింది. షాక్ వల్ల తలకి గాయాలు తగలటంవల్ల వచ్చిన మెంటల్ షాక్‌కి చక్కని ట్రీట్‌మెంట్ ఉంది. రోజాని అన్ని పరీక్షలు చేసి మామూలు మనిషిని చేస్తాను. సరేనా మామయ్యా?''

అమలవైపు చూస్తూ అన్నాడు కృష్ణ.

అమల ఉలిక్కిపడింది.

'తనకి పిచ్చిలేదు, వెర్రిలేదు. ఈయనగారు పరీక్షచేస్తే తనగుట్టు బైటపడదుకదా? లేక తనకి పిచ్చి ఏ రకమైనదో తెలియక ఈయనగారి బుర్ర గిర్రున తిరిగిపోతుందో?'

''ఏంటి రోజా, నీలో నీవు నవ్వుకుంటున్నావు?'' కృష్ణ అడిగాడు.

ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేరకంలా ఉన్నాడు ఈ కృష్ణమూర్తి. బాప్‌రే జాగ్రత్తగా ఉండాలి, అనుకుంది అమల ''హిహిహ్హీ హాహా'' అంటూ ఓ పిచ్చినవ్వు నవ్వింది. గోళ్లు కొరుక్కుంటూ కూర్చుంది.

''ఇదీ వరసరా కృష్ణా!'' అన్నారు భుజంగరావ్‌గారు.

భారంగా నిట్టూర్పు విడిచాడు కృష్ణ.

''మామయ్యా! రోజా ఇంట్లోంచి ఎలా వెళ్ళింది? ఎవరూ గమనించలేదా? చివరిసారిగా ఆ రోజు రోజాని ఎవరు చూశారు? రోజా లేనట్లు ఎంతసేపటికి గ్రహించారు. మళ్ళీ

రోజాని ఎవరు చూశారు? అప్పుడు ఎక్కడ ఏ పరిస్థితిలో ఉంది?''

కృష్ణ వివరాలు అడిగితే భుజంగరావ్ గారు చెప్పటం మొదలుపెట్టారు జరిగింది.

'బాప్ రే, ఇతగాడు సెక్రీయాటిస్ట్ మాత్రమే గాదు, నా పాలిట యముడు. జేమ్స్‌బాండ్ తాతలా వున్నాడు,' అనుకుంది అమల.

8

"........

కృష్ణవల్ల నీవేం భయపడవద్దు. కృష్ణవల్ల ఏ చిన్న రిస్క్ ఏర్పడ్డా మేము చూచుకుంటాము. మీ వాళ్ళకు లెటర్ రాయి. అందజేస్తాను. ఇంకొన్ని రోజులని ఆందోళన పడవద్దు. నీవు ఇక్కడ క్షేమంగా ఉన్నావు. మీవాళ్ళు అచ్చట క్షేమంగా ఉన్నారు. త్వరలోనే మా పని పూర్తి చేసుకోవాలని తీవ్ర ప్రయత్నంలో వున్నాము. తెలివిగా మసులుకో. లేకపోతే వేరే చెప్పే పనేముంది. మీ నాన్న రాసిన లెటర్ దీనితో జతచేస్తున్నాను.

భగవాన్."

నాన్నగారు లెటర్ రాశారుట. వీడు ఎంత శ్రద్ధగా అందజేస్తున్నాడో? దొంగ వెధవ. పేరు భగవాన్, చేసేది తప్పుడుపనులు. ఈ ఇంట్లో అడుగుపెట్టి నెలకావస్తున్నది. అమ్మ నాన్నగార్లు ఎలా వున్నారో? నాగురించి ఏమనుకుంటున్నారో? తెలివిగా ఈ చెరలోంచి విముక్తి పొందుదామని నేరాసిన లెటర్ ఎవరికి అందివ్వాలో అర్థంకాలేదు. అలాగే వుండిపోయింది. పోనీ కృష్ణ తెలివి కలవాడిగా అవుపిస్తున్నాడు ఇతనికి అందిద్దామంటే, ఆవేశంతో అప్పటికప్పుడు ఎగిరిపడే రకం. లాభంలేదు. ఈ ఇంట్లో

సగం మంది తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టేవాళ్ళే. ఏం చేయాలి? ఎలా బైటపడాలి?

—తీవ్రంగా ఆలోచిస్తున్నది అమల.

కృష్ణ పిల్లిలా చప్పుడు చేయకుండా అమల గదిలోకి వచ్చి తలుపులు లోపల గడియవేశాడు. అమల యెదుటికొచ్చి నుంచున్నాడు.

"రోజా!" కృష్ణ పిలిచాడు తగ్గుస్వరంతో.

అమల ఉలిక్కిపడి "ఊ" అంది.

కృష్ణ నవ్వాడు. నిప్పులు కక్కుతూ అమల కళ్ళలోకి చూచి నవ్వాడు.

అమల రవంత భయంతో కృష్ణవైపు చూచి నలువైపులా చూచింది. తలుపులు లోపల గడియ పెట్టినట్లు, కావాలనే కృష్ణ తనవద్దకు వచ్చినట్లు గ్రహించింది. ఓ అడుగు వెనక్కు వేసింది. శంకరంలా పిచ్చిపని చేయటానికి కృష్ణ రాలేదు కదా?

"ఎవరు నువ్వు?" అమలవైపు తీవ్రంగా చూస్తూ అడిగాడు కృష్ణ.

అమల మౌనం వహించింది. గుండె టకటక కొట్టుకుంది. పిచ్చిగా కృష్ణవైపు చూసింది.

"నిన్నే అడిగేది? సరోజ ఏమయింది? నీ పేరేమిటి?"

"ప్రభా, హరహర ప్రభా!" అంది తెలివి తెచ్చుకున్న అమల.

"నోరు ముయ్యి. ప్రభట ప్రభ... నేను ఇక్కడికొచ్చిన మూడోరోజునే గ్రహించాను, నీవు రోజావి కాదని. పరీక్ష చేయటంతో నీ బ్రెయిన్ నిక్షేపంగా వుందని, నీకలాంటి పిచ్చి లేదని తెలిసిపోయింది. మామయ్యకి చెపితే

మళ్ళీ హార్టెటాక్ వస్తుందో అని నోరు మెదపలేదు. రోజాకి తగ్గిపోతుందని అబద్ధం ఆడాను. ఎవరు నువ్వు? ఎందుకు రోజా స్థానంలో ఉండి నాటకం ఆడుతున్నావు?"

అమల మాట్లాడలేదు.

కృష్ణ చెయ్యెత్తి ఛళ్ళున అమల చెంపపై కొట్టాడు బలమంతా ఉపయోగించి.

అమలకి ప్రాణంపోయి తిరిగొచ్చింది. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "అబ్బా" అంది. చెంప చేత్తో తడుముకుంటూ.

"అబ్బా కాదు. నాలుగు వడ్డించానంటే నీ అబ్బ ఏ లోకంలో వున్నా తిరిగివస్తాడు. చెప్పు, ఎవరు నువ్వు?"

'నేను సరోజనే. మీరు పొరపడుతున్నారంటే, ఓహో! నీకు పిచ్చి ఉందీ, లేనిదీ యిామాటే చాలు తెలిసిపోతున్నది, అంటాడు. సరోజను కాదంటే, కథంతా చెప్పాలి. ఆ స్త్రీకోసం తెగించిన భగవాన్ అర క్షణంలో ప్రాణం తీస్తాడు. వాడికి వెయ్యికళ్ళు, పదహారువందల చెవులు వున్నాయి. ప్రస్తుతానికి మౌనం వహించటమే శ్రేయస్కరం.'

"ఏమిటి ఆలోచిస్తున్నావు? కట్టుకథ చెపుదామనా?"

అమల పెదవి కదపలేదు.

"నువ్వెవరో నాకు తెలియదు. సరోజవు మటుకు కాదు. చావగొట్టి, చెవులుమూసి ఈ క్షణాన నీ నోట్లోంచి నిజం కక్కిద్దును. మామయ్యకోసం ఊరుకున్నాను. సరే ఇప్పటికి వెళుతున్నాను. జాగ్రత్త! ఈ కృష్ణ ముందు నీ ఆటలు, నాటకం సాగవు గుర్తుంచుకో. రెండురోజులు టైమ్ ఇస్తున్నాను. నువ్వెవరివో నిజం చెప్పకపోయావా, ప్రాణం తీస్తాను" అని కృష్ణ తలుపు తీసుకుని బైటకు

వెళ్ళిపోయాడు.

చెంప తడుముకుంటూ చాలాసేపు అమల పిచ్చిదానిలా అలా ఉండిపోయింది.

'ఊహూ, లాభంలేదు. ఇటు చూస్తే సింహం, అటు చూస్తే పులి. బోనులో మేకపిల్లను నేను. తెగించాల్సిందే. ఈ దెబ్బతో చావో, బ్రతుకో తేలిపోతుంది. కృష్ణకు అంతా చెప్పేసి భగవాన్ ఉనికిని కనిపెట్టమని కోరాలి,' అనుకుంది అమల మొండి ధైర్యంతో.

ఉన్నట్లుండి అమలకు కరెంట్ షాక్ తగిలినట్లు అనుమానం వచ్చింది.

కృష్ణకూడా భగవాన్ అంత ఎత్తు, లావులో వున్నాడు. భగవాన్, కృష్ణ ఎందుకు కాకూడదు? నామీద అనుమానం కలిగి నిజం చెపుతానా, లేదా అని చిన్న ప్రయోగం నాపై జరిపివుంటాడు. ఈ మధ్యనే ఊరినుంచి వచ్చినట్లు నటించాడేమో? నెలరోజుల క్రితమే ఈ ఊరు వచ్చి భగవాన్ పేరుతో కృష్ణ నన్నెత్తుకొచ్చి వుంటాడు. అంతే, ఈ కృష్ణనుకూడా నమ్మకూడదు.

కృష్ణ, భగవాన్...భగవాన్, కృష్ణ.

కసిగా పళ్ళు నూరి సరికొత్త పథకం ఆలోచిస్తూ కూర్చుంది అమల.

9

"ఏడ్వకు తల్లీ! నే చూడలేను," బాధగా అంటూ భుజంగరావ్, అమల కన్నీళ్ళు తుడిచాడు.

"నా ప్రభ కావాలి, నా ప్రభను తెచ్చివ్వండి. లేకపోతే నే పోతాను. చచ్చిపోతాను. ఊఁ...ఊఁ..." అంటూ అమల పిచ్చిపిచ్చిగా వాగుతున్నది. భుజంగరావ్ వడిలో తలదూర్చుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

భుజంగరావ్, "ఊరుకో తల్లీ, ఊరుకో" అంటున్న కొద్దీ అంతకంతకు పిచ్చిగా వాగటం, ఏడ్వడం ఎక్కువైంది అమలకు.

సుందరమూర్తి, శంకరం, నాయర్ ఏంచేయాలో తెలియక అయోమయంగా ఎక్కడివాళ్ళక్కడ నుంచుండిపోయారు.

"కృష్ణ లాన్‌లో పేపరు చదువుతూ కూర్చున్నాడు. పిలుచుకురా శంకరం," అన్నాడు భుజంగరావ్.

శంకరం పరుగున వెళ్ళాడు.

"కృష్ణ లేదు, గ్రిష్ణ లేదు. ప్రభను పిలుచుకురండి. పొండి. అంతా పొండి. ప్రభను తీసుకురండి, లేకపోతే చస్తాను. మీ అందరినీ చంపేస్తాను," అంటూ అమల సుందరమూర్తి మీదకు, నాయర్ మీదకు చేతులు చాచి భద్రకాళిలా వెళ్ళింది.

నాయర్ భయంతో ఓ అడుగు వెనక్కు వేశాడు.

సుందరమూర్తి బిగుసుకుపోయినట్లు నుంచుండిపోయాడు.

అమల చేయిచాచి ఈడ్చి సుందరమూర్తి చెంపమీద కొట్టింది. "ప్రభను తెమ్మంటే పోవేం, ఎద్దు మొద్దు వెధవ" అంది. వెంటనే నాయర్ వద్దకు పరుగు తీసింది.

నాయర్ పరుగున వెళ్ళిపోయాడు.

సుందరమూర్తి రెండడుగులు వెనక్కు వేశాడు, అమల పిచ్చిని చూచి.

"పోతావా, చంపేయనా?" అంది పెద్దగా అరుస్తూ అమల.

భుజంగరావ్ వెళ్ళమన్నట్లు చెయ్యి ఊపుతూ సౌంజ్ఞ చేశాడు.

సుందరమూర్తి కోపంగా వెళ్ళిపోయాడు.

అమల మళ్ళీ భుజంగరావ్ వద్దకు వచ్చి గట్టిగా భుజంగరావ్‌ని వాటేసుకుంది. "ఇదిగో పిల్లెవరు? ప్రభను తీసుకురాకపోతే, నీవన్నా తీసుకురావాలి. లేకపోతే ఊరుకోను. ప్రభా, ఓ ప్రభా, రావా?" అంటూ మళ్ళీ రాగంతీయటం మొదలుపెట్టింది.

భుజంగరావ్ "అలా గేనమ్మా" అని అమల భుజం నిమురుతూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

శంకరం, కృష్ణను తీసుకునివచ్చాడు.

అమల ఏడ్పుమాటలు చూచి నిర్ఘాంతపోయాడు కృష్ణ.

"ఏమయింది మామయ్యా?"

"నా తల్లి పిచ్చి ఈ పూట ఎక్కువయిందిరా, ఈ ఏడ్పు, ఈ హృదయాన్ని కదిలించే మాటలు వినలేకుండా ఉన్నారా? ఈ స్థితిలోవున్న రోజాని చూస్తూ చావలేక బ్రతకలేక ఉన్నారా కృష్ణా?"

"ఏమిటి మామయ్యా! పులిలాంటి నువ్వు ఇలా మాట్లాడటమేమిటి? ఇప్పుడేమైందని, ఇంతగా అధైర్యపడతావు? రోజాని మామూలు మనిషిని చేస్తానని మాటిచ్చాను. నా మీద నమ్మకం లేదా?"

"నీ మాటతో ఇంకా బ్రతికున్నారా కృష్ణా! రోజాని చూడు ఏమయిందో?"

కృష్ణ చరచర అమలవద్దకు వచ్చి అమల భుజంమీద చేతులువేసి తనవైపు బలవంతానా తిప్పుకున్నాడు. లాక్కెళుతున్నట్లే తీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టాడు. అమల చేతులు కదలకుండా తన చేతులతో గట్టిగా మంచానికి నొక్కి పట్టుకున్నాడు.

10

"రోజా వున్నట్లుండి విపరీతంగా ప్రవర్తించటానికి ఏదో కారణం వుంది. మీరంతా దూరంగా ఉండండి పరీక్ష చేయాలి," అన్నాడు గంభీరంగా కృష్ణ.

భుజంగరావ్, శంకరం, అప్పుడే మేనేజర్ రామచంద్రతో వచ్చిన సుందరమూర్తి మంచంచుట్టూ గుమిగూడిన వాళ్ళు కృష్ణ మాటలతో దూరంగా పోయి నుంచున్నారు.

కృష్ణ తీవ్రంగా అమల కళ్ళల్లోకి చూశాడు.

అమల, కృష్ణ చూపుల్లో చూపులు కలపలేక కళ్ళు మూసుకుంది.

కృష్ణ కావాలని ఆదుర్దా నటిస్తూ, పల్స్ చూచి, అమల మీదకు వంగి తల నరం నొక్కి పరీక్ష చేయటం మొదలుపెట్టాడు.

"ఏం కావాలి రోజా?"

"ప్రభ...ప్రభ...ప్రభా తొందరగా రా!" అంది.

అమల తలమీద పరీక్ష చేస్తున్నట్లుగా చెవి ఆనించాడు కృష్ణ.

"ఇడియట్. నిప్పుతో చెలగాటమాడుతున్నావ్? పిచ్చిలేని నీకు ఇంకా పిచ్చి ఎక్కువయిందే? మామయ్యా హార్ట్ ట్రబుల్ పేషంట్ అని చూస్తున్నాను. ప్రభ కాదు నీకు కావలసింది. మృత్యువు. పిచ్చి పనులు చేసి మామయ్యా మనసు క్షోభ పెట్టకు. మరోసారి ఇలా చేశావంటే సరాసరి యమపురికి పంపుతాను. జాగ్రత్త!" అతి నెమ్మదిగా అమలకు మాత్రమే వినిపించేటట్లు అన్నాడు కృష్ణ.

"ముందు నన్ను పంపు. నే వెళ్ళి నీకు అక్కడ సీటు రిజర్వ్ చేస్తాను," గొణిగింది అమల.

కృష్ణ కోపంగా అమల జబ్బమీద గిల్లాడు రక్తం

వచ్చేటట్లు.

"కేవ్" మని అరిచింది అమల.

"ఏమంది? ఏమయింది?" గాభరాపడుతూ మంచం వద్దకు పరుగున వచ్చాడు భుజంగరావ్.

"ఏం కాలేదు మామయ్యా! కలలో ప్రభాకర్ వచ్చి వుంటాడు. విపరీతంగా తలలో నరాలు చలిస్తున్నాయి. అందువల్ల ఇలా ప్రవర్తిస్తున్నది. మామయ్యా, రోజాని నాల్గు రోజుల్లో అసలు మనిషిగా నీముందు పెడతాను," అన్నాడు కృష్ణ మంచంమీదనుంచి లేస్తూ.

"నీమీద నాకా నమ్మకం వుందిరా కృష్ణా!" అంటూ భుజంగరావ్, అమల మంచంమీద కూర్చున్నాడు.

'నాకు సీటు రిజర్వ్ చేస్తుందా? తేలిపోయింది. నా అనుమానం నిజం అయింది. రోజా కాదు ఇది...ఇది... మాయలాడి' కృష్ణ అనుకున్నాడు.

'రక్తం వచ్చేటట్లు గిల్లుతావా? ఈ పిచ్చివేషంలో నీ రెండు జబ్బలు కండ లూడి వచ్చేటట్లు గిల్లకపోతే చూసుకో,' అనుకుంది అమల.

అమలవైపు చూస్తు కూర్చున్నాడు భుజంగరావ్.

11

రాత్రి పన్నెండు గంటలు దాటింది.

అమావాస్య రోజులు కావటంవల్ల బైటంతా చీకటిగా వుంది. భుజంగరావ్ ఇంట్లో అందరు నిద్రపోతున్నారు. ఆ ఇంటి మొత్తంమీద అమల ఒక్కతే నిద్ర మేల్కొని వుంది.

అమల చప్పుడు చేయకుండా మంచం దిగింది. ఏ మాత్రం చప్పుడు కాకుండా గదిలోంచి మెల్లిగా అడుగులు వేస్తూ బైటకు వచ్చింది. నలువైపులా ఓసారి చూచి వరండా దాటి బైటకు వచ్చింది. పరుగులాంటి నడకతో,

దొడ్డి దోవగుండా వీధిలోకి వచ్చి రోడ్డు ఎక్కింది.

చీకట్లో రెండు బలమైన హస్తాలు అమలను బంధించి, దొడ్డి గోడపక్కకు లాక్కొచ్చాయి.

"ఎవరు నన్ను పట్టుకుంది? వదలండి" అంది అమల పెనుగులాడుతూ.

"నా పేరే భగవాన్! ఎక్కడికి వెళుతున్నావ్ నా కళ్ళు గప్పి?" భగవాన్ కఠినంగా అడిగాడు.

"అరి భగవంతుడా? నీ కళ్ళు కప్పి పారిపోవటం..."

"ముందే చెప్పాగా నాకు వెయ్యి కళ్ళని. ప్రతి నిమిషం నీ చర్య కనిపెడుతూ వుంటామని. అసలెలా గది లోంచి బైటకు వచ్చావు. గది తలుపులు బైట వేసి ఉంటాయి కదా! పారిపోవటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"నీకేం నువ్విక్కడ చల్లగా వున్నావ్, నా పని సాలె గూడులో చిక్కుకున్న ఈగలా వుంది. శంకరం సమయం కోసం చూస్తున్నాడు, పిచ్చిదాన్ని కదా బలత్కరించ వచ్చని. కృష్ణ అనుమానించాడు. నే నెవరికో చెప్పక పోతే ప్రాణం తీస్తానని కూర్చున్నాడు. నిద్ర లేచాను. నా గది తలుపులు తీసి వున్నాయి. పారిపోటానికి ఇదే సందని బైలుదేరాను. నీ పనికో నమస్కారం! నా దోవన నన్ను పోనియ్యి."

"నీ దారిని నిన్ను పోనీయటానికి కాదు, ఇక్కడికి తీసుకొచ్చి నిన్నుంచింది. నాతో గట్టిగా చెపితే కృష్ణని, శంకరంగాడిని పై లోకానికి తరలించేవాడిని. మావాళ్ళు 'ఊ' అంటే క్విక్ గా పని చెయ్యటానికి తయారు."

"ఆ పని భుజంగరావ్ గారినే చేస్తే ఆస్తి నా పేర ఉంటుంది. మీకొచ్చేది. నే వెళ్ళిపోయేదాన్ని కదా?"

"కృష్ణ మధ్యలో వస్తా డనుకోలేదు. లేకపోతే యీ

పాటికే భుజంగరావ్‌ని అడ్డు తొలిగించేవాడిని, ఆ స్తి మా పరం అయేది. హార్ట్ ఎటాక్‌తో ముసలాడు చచ్చాడని అనుకునేవారు. ఇప్పుడయినా మించిపోయిందిలేదు. అమలా! నువ్వు యధావిధిగా వెళ్ళి నీ గదిలో పడుకో. త్వరలో పని పూర్తి చేస్తాను,'' అన్నాడు భగవాన్.

''భుజంగరావ్‌గారి చావుతో మీ పని పూర్తవుతుందేమోగాని నా పని కాదు. నే ఆ ఇంట్లో వుంటేనే కదా నా ద్వారా ఆ స్తి మీకు దక్కేది. మీరు మొదటినుంచీ నన్ను మోసంతో మీ విషవలయంలోకి లాగారు. మా నాన్నగారికి నాకు లెటర్స్ అందిస్తున్నారు. అది నాన్నగారు రాసినవి కావు.''

''ఎలా తెలిసింది?'' అరిచినట్లే అడిగాడు భగవాన్.

''అంతేగాదు. ఆ ఇంట్లో నీ వెవరివో కూడా తెలిసిపోయింది.''

''ఆ...!''

''భుజంగరావ్‌ని ఏం చేస్తారో నాకనవసరం. నా దోవన నే పోతున్నాను. మీ ఇష్టం వచ్చింది మీరు చేసుకోండి.''

''నీ వెక్కడి కెళ్ళటానికీ వీలులేదు. మాపని పూర్తికాంది, మా కథ తెలిసిన నిన్ను పోనిస్తామా? మర్యాదగా ఇంట్లోకి నడువు. పిచ్చి రోజాగానే నటించు రేపురాత్రిలోగా భుజంగరావ్‌ని, కృష్ణని ఏంచేయాలో చేసేస్తాను.''

''చంపుతావా?''

''అదేం బ్రహ్మవిద్యకాదు. మా మాట వినకపోతె నీగతీ అంతే.''

అమల చటుక్కున పరుగుతీసింది ముందుకు. భగవాన్ వేగంగా వెళ్ళి అమలను పట్టుకున్నాడు.

"చంపేస్తున్నాడు రండి, రండి." అరిచింది అమల.

అమల నోరు ఓ చేత్తో నొక్కి, రెండో చేత్తో అమల పారిపోకుండా పట్టుకున్నాడు భగవాన్.

"నామాట వినవ్ కదూ? సరే ఇప్పుడే చంపను. నరక యాతన పెట్టి కొద్దికొద్దిగా ప్రాణం తీస్తాను. ఎంతకమ్మగా ఉంటుందో చూద్దువుగాని."

అదే సమయంలో వెనుకనుంచి వచ్చిన ఓ వ్యక్తి పిస్టల్‌తో భగవాన్ తలపై కొట్టాడు. వెంటనే ఈల వేశాడు.

ఈల వింటూనే బిలబిలమంటూ నలువైపులనుంచీ అర డజనుమంది వచ్చారు.

12

హాలులో సోఫాల్లో అందరూ కూర్చున్నారు.

ముందుగా అమలే పెదవి విప్పింది.

"నాన్నగారూ! నే ఇంట్లోంచి మాయంకావటంగురించి ఏమనుకున్నారు, మీరు అమ్మాను?"

"ఊరినుండి రాగానే ఇంటి తలుపులకి తాళంవేసి వుండటం చూశాను. ఈ తాళం చెవులు నీవద్ద నావద్ద వున్నాయిగా, తాళం తీసుకుని లోపలికి వెళ్ళాను. నీవు లేచిపోయి పెళ్ళిచేసుకున్నట్లు రాశిన లెటర్ చదివి బాధ పడ్డాము. మీ అమ్మ ఆ నిమిషంనుండే మనోవ్యాధితో పిచ్చి దానిలా అయిపోయింది. ఈ విషయం ఎవరికి తెలియటం ఇష్టంలేక మీ అమ్మమ్మగారి ఊరికి పంపాను అమ్మను. నేను ఇంట్లో 'ఎందుకిలాంటి పని చేశావు అమలా! నీమాట కాదంటామని ఎట్లా అనుకున్నావమ్మా!' అనుకుంటూ దిగులులో రోజులు గడిపేస్తుంటే నిన్న భుజంగరావ్ గారి వద్ద

నుండి లెటర్ తీసుకుని వారి నౌకరు వచ్చాడు. నీవు క్షేమంగా వున్నట్లు అమ్మకు టెలిగ్రాం ఇచ్చివచ్చాను," అని పరంధామయ్య చెప్పాడు.

"అమలా! నీ ధైర్యం, సమయస్ఫూర్తి మెచ్చుకోదగింది. జరిగింది వివరంగా నీ నోటివెంట వినిపించు," అన్నాడు భుజంగరావ్.

అక్షరం పొల్లుపోకుండా జరిగిందంతా చెప్పింది అమల. తర్వాత అంది. "ఈ ఇంట్లో ఎవర్ని నమ్మాలో తెలియలేదు. తెగించాను. బాగా పిచ్చి ముదిరినట్లు నటించి, ఏడుస్తూ భుజంగరావ్ గారి ఒడిలో తల దూర్చుకుని... 'నేను పిచ్చిగా నటిస్తున్నాను. నాకేం పిచ్చి లేదు. మీ జేబులో నే వివరంగా రాసిన లెటర్ పెట్టాను. చదివి తర్వాత నేనేం చేయాలో చెప్పండి,' అని లెటర్ జేబులో పెట్టాను.

ఏదో గూడుపుఠాని జరుగుతుందని గ్రహించిన భుజంగరావ్ గారు వెంటనే అలాగే అన్నారు. ఆ తర్వాత లెటర్ చదువుకుని ఉంటారు. లెటర్ లో నా వివరాలు. ఎలా ఈ ఇంట్లో ప్రవేశపెట్టబడిందీ రాశాను. భగవాన్ ఎవరయినదీ బైటపడటానికి మార్గం ఆలోచించి చెప్పమన్నాను.

ఆ తర్వాత భుజంగరావ్ గారు మినీ టేప్ రికార్డర్ అందించారు. దానితో ఓ లెటర్ కూడా. 'రాత్రిపూట నీ గది తలుపులు బైటగడియ తీసి ఉంచుతాను. నీవు ఇంట్లోంచి పారిపోయినట్లు నటించు. భగవాన్ గాని, వాడి అనుచరులు గాని నిన్ను బంధిస్తారు. నీవు వాళ్ళని మాట్లాడించు. రికార్డ్ అయిపోతోంది. నీకే ఆపద రాకుండా నీ వెనకనే ఇన్ స్పెక్టర్ ని పరివారాన్ని వుంచుతాము,' అని వుంది.

భుజంగరావ్ గారి ప్లాన్ సక్ సెస్ అయింది."

ఫోన్ మోగటంతో కృష్ణ లేచి వెళ్ళి రిసీవర్ అందు కున్నాడు. మాట్లాడి తర్వాత రిసీవర్ క్రెడిల్ పై వుంచి వచ్చి, సోఫాలో కూర్చున్నాడు.

"ఇన్ స్పెక్టర్ విజయ్, ఫోన్ చేశారు మావయ్యా! సుందరమూర్తి తానే భగవాన్ గా నటించినట్లు ఒప్పు కున్నాడుట. సుందరమూర్తితో చేతులు కల్పిన మేనేజర్ రామచంద్ర, నాయర్ కూడా నేరం ఒప్పుకున్నారుట. మరో పావు గంటలో ఇచ్చటికి వస్తానని ఇన్ స్పెక్టర్ విజయ్ చెప్పారు." కృష్ణ అన్నాడు.

"సుందరమూర్తి ఇంత నీచుడనుకోలేదు. వేషాలు మార్చటం, కంఠధ్వని మార్చటం, ఫోర్జరీ చేయటం వాడికి తెలిసిన విద్యే. ఆస్తికోసం నా తల్లి రోజాని వీళ్ళపాట్లన పెట్టుకని వుంటారు. రోజాతల్లి ఇక లేదురా కృష్ణా! వీళ్ళ ఎత్తులు పారలేదు నా యావదాస్తి అనాధ శరణాలయాలకు రాసినందున ప్లాన్ పన్ని అమలను రోజాగా నా ఇంట్లో ప్రవేశపెట్టారు. అమలా! నా రోజాతల్లిలా వున్నా నీవు నా మనశ్శాంతికయినా మధ్యమధ్య వస్తూ వుండు. మీ కెవరికీ అభ్యంతరం లేకపోతే నీవూ నీవాళ్ళూ మా ఇంట్లోనే వుండండి," అన్నాడు భుజంగరావ్.

"మా అమల దూరమయినందుకు ఈ నెల రోజులు చావ లేక బ్రతకలేక రోజులు ఈడ్చాను భుజంగరావ్ గారూ! మాకే కానుకలూ వద్దు. అమల ఇహపై మీకూ నాకూ కూతురే. బిడ్డ దగ్గరలేని బాధ అనుభవించాను. మీ మన శ్శాంతికి అమల మీ బిడ్డగా భావించండి," అన్నాడు పరంధామయ్య.

"సారీ అమలా! నీవో మోసగత్తెవనుకుని చెంపదెబ్బ బహుకరించాను, తులనాడాను, చేతిపై గాటుపడేటట్లు

గిల్లాను. రోజా అంటే నాకు ప్రాణం. రోజా స్థానంలో ఆ స్త్రీకోసం మోసంగా నీవు తయారయావని రాక్షసుడిలా ప్రవర్తించాను,'' కృష్ణ బాధగా అన్నాడు.

''మనిషికి రూపం ఒక్కటే కాదు, హృదయంకూడా అందంగా వుండాలి. ఆ రెండు సుగుణాలు మీవద్ద ఉన్నాయి. తెలివికలవారంటే నాకెంతో ఇష్టం. మీరు తెలివితేటలతో నన్ను గుర్తించినందుకు ఆనాడే అభినందించేదాన్నే. నేనున్న పరిస్థితి చూచారుగా? మీరే భగవాన్ అని పొరపడి, పిచ్చిలోనే నా కసి తీర్చుకోటానికి సమయం ఎప్పుడు దొరుకుతుందా? వళ్ళంతా గోళ్ళతో గీరిపెట్టి, చెంపలు వాయిద్దామనుకున్నాను,'' ఉన్న మాట చెప్పింది అమల.

''ఇప్పుడుమటుకు సమయం ఏం మించిపోయింది? ఊ..' కానియ్, రక్కుతావో, గిల్లుతావో, చెంపలు వాయిస్తావో, నీ ఇష్టం! నా శరీరమే నీ కప్పగించేస్తున్నాను,'' కృష్ణ నవ్వుతూ అన్నాడు.

అమల బుగ్గలు ఎర్రపడ్డాయి. సిగ్గుతో తల వంచుకుంది.

భుజంగరావ్, పరంధామయ్య ముఖాముఖాలు చూచుకుని నవ్వుకున్నారు.

—: ఐపోయింది :—